ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్‌ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 71 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.ప్రకాష్ బాబు, మహిళా పిఎస్ డిఎస్‌పి ఇ.బాలస్వామిరెడ్డి, డిటిసి ఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

గందరగోళం..వ్యవసాయం!

- ఏ పంట వేయాలో తెలియని పరిస్థితి
- గిట్టుబాటు ధరలు కరువు
- సందిగ్ధంలో అన్నదాతలు

పొలాల్లో వదిలేసిన ఉల్లి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

అన్నదాతలకు వ్యవసాయం గందరగోళంగా మారింది. ఏ పంట వేయాలో అయోమయ స్థితిలో రైతన్న ఉన్నాడు. సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర కరువవ్వడంతో ఏ పంటలు సాగు చేస్తే ఆదాయం వస్తుందనే ఆలోచనలో పడ్డాడు. ఏ పంట సాగుచేసినా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం, గిట్టు బాటు ధర లేకపోవడం వంటి కారణాలతో జిల్లా రైతులు ఇప్పుడు పెద్ద సందిగ్ధంలో పడ్డారు. రబీలో పంటల సాగుకు సమయం ఉంది. ఏ పంట వేస్తే చేతికి వస్తుందనేది అంతుచిక్కడం లేదు. పంటలు దెబ్బతిన్న పొలాల్లో కొత్తగా ఏ పంటవేయాలో తెలియడం లేదు. ముఖ్యంగా ఉద్యానవన పంటల విషయానికి వస్తే అరటి సాగుపై పూర్తిగా గందరగోళం నెలకొంది. ఎందుకంటే ధరలు పూర్తిగా పడిపోయాయి. కరోనా తర్వాత అరటి ధర టన్ను రూ. 30 వేల రూపాయలు కూడా దాటింది. ప్రస్తుతం కాయల నాణ్యతను బట్టి టన్ను రూ. 2 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే ఉంది. అలాగే ఉల్లి ధర కిలో రూ. 100 పైగా పలికిన ఉన్న కాలం కూడా చూశాం. ప్రస్తుతం రైతు దగ్గర నుంచి వ్యాపారులు రూ. 3 నుంచి రూ. 4 కొనుగులు చేసి మార్కెట్లో రూ. 20 నుంచి రూ. 25 వరకు విక్రయిస్తున్నారు. ఇలా ఎంతకాలం ఉంటుందో తెలియని పరిస్థితుల్లో రైతన్న ఉన్నారు. వ్యాపారులు రాక అరటి పండ్లు మాగుతుండడంతో కొంతమంది రైతులు అరటిపంటను నేలమట్టం చేస్తున్నారు. ఏ పంట సాగుచేయాలా? లేదా? అనేది అంతుచిక్కడం లేదు. ఉల్లి, టమోటా, మొక్కజొన్న ధరలు కూడా పూర్తిగా పడిపోవడంతో రైతులు ఏ పంట సాగు చేయాలన్న సందిగ్ధంలో ఉన్నారు. రైతుల్లో పంట సాగు చేయాలన్న ఉత్సాహం పూర్తిగా లేకుండా పోయింది. అరటి సాగు చేసిన రైతుకు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ప్రాంతాలను బట్టి నష్టం వచ్చిందని అంటున్నారు. అరటి, ఉల్లి రైతులు కోలుకోని పరిస్థితి లేదు. ఈ ఏడాది జిల్లాలో అరటి 27000 ఎకరాలు, ఉల్లి 11800 సాగు చేసినట్టు అధికారులు తెలుపుతున్నారు. ఈ ఏడాది ప్రజాప్రతినిధులు దీనిపై పట్టించుకోలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. రెండో అతిపెద్ద వాణిజ్య పంట అయిన శనగకు ధరలు లేవు. గతఏడాది పండించిన పంట కోల్డ్ స్టోరేజీల్లో ఉంది. ఎందుకంటే ధర రూ.5 వేలకు పడిపోయింది. పదేళ్ల కిందటే రూ. 9 వేలు విక్రయించారు. దీని అవసరం ఉన్న ధరలు మాత్రం పెంచడం లేదు. జిల్లా అంతటా శనగ పంట భూములకు అనుకూలించింది. దీనిపై ఆసక్తి పెరిగింది. ధరల్లే ఇప్పుడు ఏంచేయాలో తెలియడం లేదు. గతేడాది నిల్వలే పోకుంటే ఇప్పుడు పండించిన ఎక్కడ పెట్టాల్సిందే రైతుల్లో ఆందోళనగా మారింది. జిల్లాలో శనగ కూడా 35 వేల ఎకరాల్లో సాగు ఉంది. టమోటా పంటకు ఎప్పుడూ తెగుళ్ళ సోకడం, ధర కూడా ఆశాజనకంగా లేకపోవడంతో ఈ పంటను కూడా సాగు చేయడానికి రైతులు విముఖత చూపుతున్నారు. ఇప్పుడు వాడిస్తానంలో ఏ పంటలు వేయాలో తెలియని లేదని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న, మినుము తదితర ఉత్పత్తులను దిగుమతులకు అనుమతి ఇవ్వడంతో వాటి ధరలు గతంలో క్వింటా రూ.2400 ఉండగా, ఇప్పుడు రూ.1700కు పడిపోయింది. వ్యవసాయం తీవ్ర గందరగోళంలో ఉన్నా ప్రజాప్రతినిధులకు మాత్రం పట్టడం లేదు.

వ్యాపారస్తులు రాక చెట్టుకే మాగుతున్న అరటి

కరోనాలోనూ ఇలాంటి పరిస్థితి లేదు

కరోనా పరిస్థితిలోనూ ఇంత తక్కువ తక్కువగా చూడలేదు. ధరలు తగ్గడంతో అరటి, ఉల్లి కొనడానికి వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు. పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- కరుణాకర్‌రెడ్డి, అరటి రైతు, లింగాల మండలం

అప్పులు పెరుగుతున్నాయి

ధరలు తక్కువగా ఉండడంతో ఏ పంట సాగు చేయాలన్న భయమేస్తుంది. పంట సాగు చేయడానికి తెచ్చిన అప్పులు పెరుగుతున్నాయే తప్ప ధరలు మాత్రం పెరగడం లేదు. ఏదైనా ఏ పంటకు చూసినా ధరలు గణనీయంగా తగ్గడంతో ప్రతి రైతుకూ నష్టపోవడం తప్పలేదు.

- రామచంద్రారెడ్డి, రైతు, వేముల మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి

రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి. పంటను నిల్వ ఉంచుకోవడానికి రైతుకు సౌకర్యాలు కల్పించి ధరలు వచ్చినప్పుడు అమ్ముకునే ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలు చేపట్టాలి. ప్రజాప్రతినిధులు రాజకీయ లబ్ది కోసం కాకుండా రైతుల మేలు కోసం ప్రయత్నించాలి.

- రామనాథరెడ్డి, రైతు, తొండూరు మండలం

ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలి

యూనియన్ జాతీయ కోశాధికారి బి.ఎన్. రవి

మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - కడప అర్బన్

29 కార్మిక చట్టాలని కుదించి 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికవర్గ హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త ఈనెల 26న నిర్వహించే నిరసనను జయప్రదం చేయాలని, ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జాతీయ కోశాధికారి బి. ఎన్.రవి పిలుపునిచ్చారు. సోమవారం ఎల్ఐసి ఆవరణలో యూనియన్ డివిజన్ 31వ మహాసభ నిర్వహించారు. యూనియన్ డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మహాసభను వ ఈ మహాసభలో జోనల్ ప్రధాన కార్యదర్శి రమేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ జాతీయ కోశాధికారి మాట్లాడుతూ 2014 నుంచి ఇప్పటి పాలకులే అధికారంలో ఉన్నారని, అప్పటి నుంచి ప్రతి ఏటా 'ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్' వార్షిక సంప్రదింపుల సమావేశాలు జరగడం లేదని అన్నారు. జోనల్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ వ్యాపారం ప్రజల నమ్మకం, ఉద్యోగుల సేవలు, ఫీల్డ్ ప్రతినిధుల పట్టుదల వల్ల బాగా పెరుగుతోందని చెప్పారు. అందుకు అనుబంధంగా సిబ్బంది సంఖ్య పెరగకపోగా క్రమంగా భారీగా తగ్గుతూ వస్తుందని పేర్కొన్నారు. తక్షణమే క్లాస్ 3,4 కేటగిరీలలో నూతన నియామకాలు చేపట్టాలని అన్నారు. 1995 పాత పెన్షన్ విధానాన్ని తారతమ్యం లేకుండా అందరికీ వర్తింప చేయాలని అన్నారు. జోనల్ కోశాధికారి ఆర్. శ్రీనివాసన్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థకు ఫంక్షనల్ ఆటానమీ, ఉద్యోగుల్లో 86 శాతం సభ్యత్వం ఉన్న తమ ఎఐఐఇఎ యూనియన్‌కు తక్షణం గుర్తింపు ఇవ్వాలని కోరారు. మహాసభ డిమాండ్లను ఆమోదిస్తూ తీర్మానించింది. డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ప్రవేశపెట్టిన వార్షిక కార్యవర్గ నివేదిక, జమా ఖర్చుల నివేదికలను మహాసభ ఆమోదించింది. అనంతరం నూనత కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అవధానం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జి. శ్రీనివాసులు, కె.పి. సూరిబాబు, జి. నాగన్న, డి.వి. సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎ. రఘునాథ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా జి. వారిజాతమ్మ, బి. అమీనా పర్వీన్, ఆర్. సునీయ కుమార్, ఎస్. శ్రీనివాసులు, కోశాధికారిగా పి. రత్నకిషోర్ సహాయ కోశాధికారిగా ఎస్. నసీరుల్లా ఖాన్, మహాసభలో పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అక్బర్ బాషా, శ్రామిక మహిళా కన్వీనర్ శ్రీకృష్ణ, ఇన్సూరెన్స్ సంఘాల ప్రతినిధులు శంకర్ రావు, చంద్రపాల్, మురళీకృష్ణారెడ్డి, నిత్యానంద రెడ్డి, రామాంజనేయులు, కిషోర్, సిఐటియు ప్రతినిధులు మనోహర్, శ్రీనివాసులు రెడ్డి, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు శ్రీనివాసులు రెడ్డి, అజీజ్, మెడికల్ రేప్స్ రామాంజుల్ రెడ్డి, టెలికం సుబ్బారావు, సుధాకర్, విద్యుత్ శివశంకర్ పాల్గొని మాట్లాడారు.

29, 30న కడప బాలోత్సవం

మాట్లాడుతున్న అధ్యక్షులు గోపాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప బాలోత్సవం - పిల్లల పండుగ 3.0 ఈనెల 29 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కడప బాలోత్సవ కమిటీ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, గౌరవ అధ్యక్షులు నాగమునిరెడ్డి, సలహాదారు వీర సుదర్శన్ రెడ్డి, కార్యదర్శులు శివరాం, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ద్వారకా నగర్‌లోని జెవివి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాల, మరియాపురంలో బాలోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గూగుల్ ఫామ్ ద్వారా రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఈనెల 25 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని చెప్పారు. 28 విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో మూడు బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి పాఠశాలకు జ్ఞాపిక అందజేస్తామని చెప్పారు. విజేతల ఎంపికలో న్యాయ నిర్ణీతలదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. అనివార్యమైతే పోటీని రద్దు చేసే అధికారం కమిటీకి ఉందని తెలిపారు. ఏ అంశమైనా సమయం మార్చే అధికారం నిర్వాహకులకు ఉంటుందని చెప్పారు.

ఒకే యాప్ అమలు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రెసిడెన్షియల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఉద్యోగులపై రెండు ఫేషియల్ యాప్ భారం తగ్గించాలని, ఒకే యాప్ అమలు చేయాలని ఎపిఎస్ డబ్ల్యూఆర్ఒఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న నాన్-టీచింగ్ (నాన్-వొకేషన్) ఉద్యోగులు ఇప్పటికే ఎపి ఫేషియల్ ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తుండగా, ఇటీవల కొంతమంది ఎంఇఒల సూచనలతో పలువురు ప్రిన్సిపళ్లు ఉదయం 9:15 గంటల లోపు ఫేషియల్ యాప్ ద్వారా కూడా హాజరు నమోదు చేయాలని బలవంతం చేస్తున్నారని ఎపి వెల్ఫేర్ రెసిడెన్షియల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ డిఒఎం, జిఒ 95 ప్రకారం ఉద్యోగుల పని వేళలు 10:30 గంటల నుంచి 5:00 గంటలని స్పష్టంగా ఉన్నప్పటికీ, లీవు యాప్ ద్వారా ముందస్తు హాజరు కోరడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.మంత్రి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకట్, అప్కాస్ ఎంప్లాయీస్ ఉపాధ్యక్షులు ఎం.రవి వర ప్రకాష్, ఎం. రామ్మూర్తి నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మనాభుడు, శ్రీనివాసులు, వెంకట శ్రీనివాసులు, కోటేశ్వర రావు, రాజకుమార్, సుభాన్, శాంతి ప్రియ, నరేంద్ర రెడ్డి, సురేష్, సత్యమయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ శ్రీధర్

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీ ఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు కచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. సిద్దవటం మండలం టక్కోలు గ్రామానికి చెందిన బి. శివకుమార్ తనకు లింగం పల్లె గ్రామంలో రెండు ఎకరాలు డికెటి పట్టా భూమిలో కరెంట్ కనెక్షన్ ఇప్పించాలని పేర్కొన్నారు. సి.కె.దిన్నె మండలం ఊటూకూరు గ్రామానికి చెందిన షేక్.మౌలాలి తనకు పక్షవాతం వచ్చిందని పింఛను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు వెంకటపతి, శిరీష, రంగస్వామి, డిఆర్‌డిఎ పీడీ జి. రాజ్య లక్ష్మి, ఎంప్లాయిమెంట్, టూరిజం శాఖ అధికారి సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే కంటికి ప్రమాదం

ప్రజాశక్తి - కడప అర్బన్

మధుమేహ వ్యాధిగ్రస్తులు సకాలంలో క్రమం తప్పకుండా మధుమేహ పరీక్షలు చేయించుకోకుండా అశ్రద్ధ చేస్తే డయాబెటిక్ రెటినోపతి కారణంగా కంటి చూపును కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని కడప ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల, రాజశేఖర్‌రెడ్డి ప్రాంగణం వైద్యులు, విట్రియో రెటినల్ సర్వీసెస్ అసోసియేట్ ఆప్తాల్మాజిస్ట్ డాక్టర్ మనోజ్ శెట్టిగర్ పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రిలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2045 నాటికి భారతదేశంలో 125 మిలియన్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉంటారని కొన్ని నివేదికలు చెపుతున్నాయని తెలిపారు. ఈవ్యాధి నేత్ర సమస్యలను పెంచుతుందని, ముఖ్యంగా డయాబెటిక్ రెటినోపతికి గురవుతారని చెప్పారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 191 మిలియన్ల ప్రజలు డయాబెటిక్ రెటినోపతితో బాధపడతారనే అంచనాలు ఉన్నాయని వివరించారు. డయాబెటిక్ రెటినోపతి ముందస్తు గుర్తింపు లక్షణాలు లేకుండా వృద్ధి చెందుతుందని, క్రమం తప్పకుండా నేత్ర పరీక్షలు చేయటం వల్ల ఈ వ్యాధిని గుర్తించి చికిత్సను అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని పేర్కొన్నారు. డయాబెటిక్ రెటినోపతి ప్రారంభంలో గుర్తించలేక పోయిన, కాలక్రమేణ దీని లక్షణాలు దృష్టి పైకి కిందకు ఊగుతున్నట్లు, మసకగా, చూపులో వ్యత్యాసం, చీకటిమయంగా, దృష్టిని కోల్పోవటం, వస్తువులు అస్పష్టంగా కనిపించచటం వంటివి బయటపడతాయని చెప్పారు. మధుమేహం ఉన్నవారు దృష్టిని కోల్పోకుండా ఉండేందుకు రెటీనాలో వచ్చే మార్పులను గమనించుటకు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

యాంటీబయాటిక్స్‌ను సరైన పద్ధతిలో వాడాలి

- రిమ్స్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగశ్రీలత

ప్రజాశక్తి -కడప సిటీ : యాంటీబయాటిక్స్‌ను సరైన పద్ధతిలో వాడకంపై అవగాహన పెంచుకోవాలని కడప రిమ్స్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగశ్రీలత పేర్కొన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలను ఈనెల 18 నుంచి 24 వరకు నిర్వహించారు. వారోత్సవాలను కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి జమున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎస్.ఎస్.యస్ వెంకటేశ్వర్లు, సిఎస్ఆర్ఎంఒలు డాక్టర్ వై. శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, వైద్యాధికారుల సహకారంతో మైక్రోబయాలజీ హెచ్ఒడి ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు నిర్వహించారు. సోమవారం ఈ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో పలు పాఠశాలల్లో పోస్టర్ ప్రదర్శన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పలుచోట్ల వైద్య విద్యార్థులు ఆరోగ్యం, చేతుల శుభ్రత, యాంటీబయోటిక్స్ వాడకం పట్ల ఆసుపత్రి ఆవరణంలో అవగాహన నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థులు చేతుల పరిశుభ్రత మీద 'ఫ్లాష్ మాబ్' ఆకర్షణీయంగా నిలిచింది. పలు పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మైక్రో బయాలజీ విభాగం వారు అభినందన పత్రాలు, బహుమతులను అందజేశారు. చివరి రోజున వైద్య సిబ్బంది వైద్య విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షులుగా మాలే శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - కడప : కడప నగరానికి చెందిన మాలే శ్రీనివాసుల రెడ్డిని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు షా మహమ్మద్ చేతుల మీదుగా నియమాక పత్రం, ఐడీ కార్డు మాలే శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా షా మొహమ్మద్ మాట్లాడుతూ కడప జిల్లాలో ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వారు తమ వద్దకు వస్తే వారికి తగు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తించుకోవాలని శ్రీనివాసుల రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది, షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఉపాధ్యక్షులు ఆమీన్ పీరా, రాష్ట్ర సభ్యులు బాలాజీ, ఎపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కె. రోడా మెర్సీ, శంకరయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న సిఐ

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల సిఐ హేమసుందర్‌రావు

ప్రజాశక్తి- కలసపాడు : విద్యార్థులు, మహిళలు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా వ్యవహించాలని సిఐ హేమసుందర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పెండ్లిమర్రి గ్రామ సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు సోమవారం పోరుమామిళ్ల సిఐ హేమసుందర్‌రావు సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, మహిళల భద్రత, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, వాట్సప్ ద్వారా బెదిరింపు, ఫొటో మార్ఫింగ్ వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి వాటిపై అధైర్య పడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కబడ్డీ అండర్-19 రన్నర్‌గా గెలుపొందిన వారిని సిఐ అభినందించారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో చురుగ్గా పాల్గొని అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. సమావేశంలో కస్తూర్బా ప్రిన్సిపల్ రెడ్డిజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తవ్వా'కు సముచిత స్థానం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు, రాయలసీమ కథా సాహిత్య పరిశోధకులు, జీవిత చరిత్రల రచనాదురంధరుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య చేసిన సేవలను గుర్తించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం హర్షణీయమని కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం రచయితల సంఘం ఆధ్వర్యంలో తవ్వాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మొదటి నుంచి డాక్టర్ తవ్వా వెంకటయ్య వైసిపికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని, అప్పట్లో తన ప్రతిభను గుర్తించి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులుగా నియమించారని పేర్కొన్నారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డాక్టర్ తవ్వా వెంకటయ్య తెలుగు సాహిత్య రంగంలో ముఖ్యంగా కథా సాహిత్యానికి చేసిన పరిశోధన చాలా విలువైందన్నారు. కార్యక్రమంలో మూగల రాజేష్, మేడిగ ఆల్ ఫ్రైడ్ ఓబులేసు పలువురు సాహిత్య మిత్రులు పాల్గొన్నారు.

తవ్వా వెంకటయ్యను సన్మానిస్తున్న మల్లికార్జున రెడ్డి

డయల్ యువర్ సిఎండికి 65 వినతులు

- ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప : విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 65 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎం కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంద్వారా 65 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను తెలియజేశారని, వాటిలో కర్నూలు సర్కిల్ నుంచి 17, తిరుపతి నుంచి 12, నెల్లూరు నుంచి 9, అనంతపురం నుంచి 7, కడప నుంచి 5, అన్నమయ్య నుంచి 5, నంద్యాల నుంచి 5, చిత్తూరు నుంచి 3. శ్రీసత్యసాయి సర్కిల్ నుంచి 2 వినతులున్నాయని వివరించారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు.

సేవతోనే జీవితానికి సార్ధకత

ప్రజాశక్తి - కడప అర్బన్

సాటి మనుషులకు సేవ చేసినప్పుడే జీవితానికి సార్ధకత చేకూరుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జోన్ చైర్మన్ లయన్ అనంతబొట్ల వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక మానస సమావేశ మందిరంలో క్లబ్ జోన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా నియమితులైన రాజంపేటకు చెందిన క్లబ్ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడును క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాశరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, రీజినల్ చైర్మన్ షేక్ మొహమ్మద్, రాజంపేట జోన్ చైర్మన్ చంద్రానాయుడు, క్లబ్ సభ్యులు సంజీవరెడ్డి, గునిశెట్టి శ్రీనివాసులు, రాఘవేంద్ర వర్మ, గౌరీ శంకర్, దేవతి రవీంద్రనాథ్, ముఖేష్, జిల్లాలోని రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, పులివెందుల క్లబ్ ప్రతినిధులు తమ సంస్థల కార్యక్రమాలను వివరించారు.

పోతుగుంట రమేష్ నాయుడును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఘనంగా ఎన్‌సిసి ఫ్లాగ్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్ : 78వ ఎన్‌సిసి ఫ్లాగ్ డేను సోమవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సలీం. బాష మాట్లాడుతూ తమ కళాశాలలో అనేక సంవత్సరాల నుంచి ఎన్‌సిసి యూనిట్ 150 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో కొంతమంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు కళాశాల నుంచి వెళ్లిపోవడంతో వారి స్థానంలో నూతనంగా అడ్మిషన్లు పొందిన మొదటి సంవత్సరంవిద్యార్థులకు అవకాశం కలిపిస్తూ సమాజ సేవపై అవగాహన కల్పించి ఎన్‌సిసిలో చేర్చుకుంటున్నామని తెలిపారు. ఎన్‌సిసి ప్రవేశం పొందిన తమ కళాశాల విద్యార్థులు ఎంతో చురుగ్గా, ధైర్యంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని చెప్పారు. జిల్లా స్థాయి రిపబ్లిక్ డే పెరేడ్‌లోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పెరేడ్లో కూడా తమ కళాశాల విద్యార్థులు పాలొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఎన్‌సిఇస అధికారి డాక్టర్ స్వరూప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి. విజయ లక్ష్మి దేవి, డాక్టర్ పి.శచీదేవి, డాక్టర్ కృష్ణవేణి, హిమకుమారి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-67 రహదారి పరిశీలన

ప్రజాశక్తి - గోపవరం : మండలం పరిధిలోని మడకలవారిపల్లె వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ హైవే-67 బైపాస్ రహదారిని సోమవారం రూరల్ సిఐ కృష్ణయ్య పరిశీలించారు. నేషనల్ హైవే అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకలవారిపల్లె సమీపంలోని బైపాస్ రోడ్డులో ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యలు చేపట్టామన్నారు. హైవే పనులు, రహదారి పరిస్థితులు, వాహనాల రద్దీ, ప్రమాదాలకు దారితీసే కారణాలను పరిశీలించామన్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించామన్నారు. ముఖ్యంగా హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ పరిమితి సూచికలు, వంటి ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు తరచూ పర్యవేక్షిస్తుంటామని చెప్పారు.

అకాడమీలో శిక్షణ తీసుకున్న తేక్వాండో విద్యార్థులు

ఎస్‌వి తేక్వాండో అకాడమీలో రెఫరీ శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక గాంధీ రోడ్డులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ అటానమస్ కళాశాల ఎస్‌వి తేక్వాండో అకాడమీ గ్రాండ్ మాస్టర్ అలిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ సహకారంతో రెఫరీ శిక్షణ నిర్వహించారు. కర్ణాటక అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్, కుకివోన్ సభ్యుడు వి.నారాయణ స్వామి, తిరుపతి జిల్లా నుంచి వచ్చిన గ్రాండ్ మాస్టర్ ఎ.నారాయణమూర్తి ఎస్‌వి తేక్వాండో అకాడమీ విద్యార్థులకు ప్రత్యేక రెఫరీ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ అలిశెట్టి శ్రీని వాసులు, అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్ కుక్కివాన్ సభ్యుడు వి.నారాయణస్వామి, గ్రాండ్ మాస్టర్ ఎ.నారాయణమూర్తి, అరకటవేముల పృథ్వీ నారాయణ, పర్లపాడు గౌరీ శంకర్, అంతర్జాతీయ ఛాంపియన్లు బెన్వార్ వరప్రసాద్, కల్లూరు రుద్ర సేనారెడ్డి, తేక్వాండో విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు ధరించిన విద్యార్థులు

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన 32 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. రూ.11,200 విలువ చేసే దుస్తులను ఉపాధ్యాయులు పుష్పలత, నాగమణి, జూనియర్ అసిస్టెంట్ శిరీషా, శ్రీరాములు, శ్రీరాజశేఖర్ క్రీడా దుస్తులను బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మి నరసింహ శాస్త్రి, పీడీ ప్రశాంతి హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌డిఒ చిన్నయ్యకు వినతపత్రం అందజేస్తున్న నారాయణ

విఆర్‌ఎల డిమాండ్లను పరిష్కరించండి

ప్రజాశక్తి - చక్రాయపేట

విఆర్‌ఎల డిమాండ్లను పరిష్కరించాలని విఆర్‌ఎల మండల అధ్యక్షుడు గిత్తోళ్ల పెద్ద నారాయణ డివిజనల్ అధికారి చిన్నయ్యకు వినతపత్రం అందజేశారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం పులివెందల ఆర్‌డిఒ కార్యాలయంలో వారు చిన్నయ్యను కలిశారు. ఈ సందర్భంగా పెద్ద నారాయణ మాట్లాడుతూ విఆర్‌ఎలుగా పనిచేస్తున్న వారికి అటెండర్ వాచ్‌మెన్ విఆర్‌ఒ ప్రమోషన్ ఇవ్వాలని, నామిని విఆర్‌ఎ పని చేస్తున్న వారికి విఆర్‌ఎగా గుర్తించాలని, గౌరవేతనం కనీసం రూ.25వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎల జిల్లా సహాయ కార్యదర్శి జివిఎల్ నరసింహులు, చక్రాయపేట మండల ప్రధాన కార్యదర్శి పిరామచంద్ర, రమణ ప్రసాద్, ఆంజనేయులు, ఎల్లమ్మ. శ్రీరాములు. విఆర్‌ఎలు పాల్గొన్నారు.

రేపు ఎదురు గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని పాములూరు గ్రామంలో బుధవారం ఎదురు గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ, ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాములూరు సర్పంచ్ మధు ప్రభాకర్‌రెడ్డి, వైసిపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, కత్తలూరు మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, బంక సోమేశ్వరరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ముక్తియార్‌ను అభినందిస్తున్న ముస్లిం నాయకులు

ముక్తియార్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్రప్రదేశ్ షేక్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎస్ ముక్తియార్‌ను ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో సోమవారం ప్రొద్దుటూరులోని ఆయన స్వగృహంలో ముస్లిం మైనారిటీ అసోసియేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూసఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలకు దగ్గరగా ఉండటం చాలా సేవలందిస్తున్నారని ముక్తియార్‌ను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఖాజాపీర్, ఖాసింవలీ, రఫీ, జమీర్, జమాల్ బాషా, హబీబ్, బాబయ్య, బాషా, రెహమాన్, హుస్సేన్ పాల్గొన్నారు.

సామర్థ్యాన్ని బట్టి విద్యార్థులకు గ్రేడ్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఒకటో తరగతి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో గ్యారెంటెడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం ద్వారా నైపుణ్య స్థాయిలను గుర్తించే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంఇఒ శివప్రసాద్ తెలిపారు. రాజీవనం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వేలో డైట్ కళాశాల విద్యార్థి, సిఆర్‌ఎంటిలు, క్లస్టర్ టీచర్ కలిసి ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం గుర్తించి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. తద్వారా విద్యార్థులను గ్రేడ్లు విభజిస్తామన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం విద్యార్థుల నైపుణ్య స్థాయిని బట్టి వారిని చదివించే ఏర్పాటు జరుగుతుందని వివరించారు. పది రోజులపాటు సర్వే జరుగుతుందన్నారు. అనంతరం తరగతి రోజుల ప్రణాళిక ద్వారా విద్యార్థులను చదివించనున్నట్లు వివరించారు.

విద్యార్థి సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఇఒ శివప్రసాద్

భారీ వర్షంతో వరి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

రెండు రోజులుగా సాధారణంగా పడుతూ, ఆదివారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి వరి రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరి పంట నూర్పిడి చేసిన రైతులు వర్షాలకు అల్లాడిపోతున్నారు. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. తుపాను తాకిడికి పంట నేల వాలుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే నూర్పిడి చేసిన రైతులు వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపై వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. వర్షం కొంత సమయం పడి ఎండ వస్తున్నప్పటికీ మళ్లీ పడుతుండటంతో ధాన్యాన్ని ఆరబెట్టలేని పరిస్థితి నెలకొంది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇప్పటికే బోరు బావులు, కుందూ నీటి ఆధారంగా ముందస్తుగా వరి పంటను సాగుచేసిన రైతులు నూర్పిడి పనుల్లో నిమగ్నమవుతున్నారు. మిగిలిన వరి పంట కూడా చివరి దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో కురు స్తున్న భారీ వర్షానికి వరి నేలకొరుగుతోందని రైతుల్లో దిగులు పట్టు కుంది. తుపాన్ ప్రభావం మరో రెండు రోజులపాటు ఉంటుందని సమా చారంతో నూర్పిడి పనులను వాయిదా వేసుకున్నారు. భారీ వర్షం పోటు చేసుకుంటే ఈ ఏడాది వరి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి. మొంథా తుపాన్ తాకిడికి ఉల్లి, మినుము రైతులు చాలా వరకు దెబ్బ తిన్నారు. ప్రస్తుతం తుపాన్ తగ్గకపోతే వరి రైతులు కూడా నష్టపోయే ప్రమాదం ఉంది.

అల్లాడుపల్లె వద్ద వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పి ఉంచిన వరి ధాన్యం

తొలి రోజు ఉత్కంఠంగా క్రీడా పోటీలు

క్రీడాకారులతో డాక్టర్ ఆర్.శారద లక్ష్మి, కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి దశ అంతర కళాశాలల క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు మూడు రోజులపాటు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 19 కళాశాలల విద్యార్థి జట్లు పాల్గొననున్నాయి. బాస్కెట్ బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ వంటి క్రీడలు కళాశాల క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్నారు. తొలిరోజు వివిధ కళాశాలల విద్యార్థి జట్లు మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల నిర్వహణను అధ్యక్షులు డాక్టర్ జి.రామ చంద్రరావు, విద్యార్థి వ్యవహారాల డీన్, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి, గౌరవ అతిథి అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి, ప్రత్యేక అతిథిగా కడప జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ షేక్ గౌస్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి దేవి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. నాయకత్వ గుణాలు పెంపొందిస్తాయని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో క్రీడాకారుల పాత్ర కూడా ఉందన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి షేక్ గౌస్ బాషా మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన క్రీడా సదుపాయాలను అందించడానికి సిద్ధంగా ఉన్నా మన్నారు. సభాధ్యక్షులు విద్యార్థి వ్యవహారాల డీన్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. సమర్థవంతంగా ఆడాలన్నారు. ఈ పోటీల సమన్వయాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తిరెడ్డి, యూనివర్సిటీ క్రీడా పరిశీలకుడు డాక్టర్ రవికాంత్‌రెడ్డి, కళాశాల పీడీ డాక్టర్ రాజశేఖర్ నిర్వహిస్తున్నారు. అదనంగా అధ్యాపకులు, ఇతర సిబ్బంది నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్నారు. కార్యక్రమానికి 19 కళాశాలల స్టూడెంట్ యాక్టివిటీ అధికారులు, ఫిజికల్ డైరెక్టర్లు, సహాయక సిబ్బంది హాజరయ్యారు.

తొలి స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ'

ప్రజాశక్తి - వేంపల్లె

ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

భారత తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 219 జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం ఆజాద్ 67వ వర్ధంతి, పట్టాభి 145వ జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటుకు 10 ఏళ్ల ముందే ఆంగ్లేయులు, ఈస్ట్ ఇండియా కంపెనీ దుష్టపాలనపై తిరుగుబాటు చేసి వీర మరణం పొందిన భారత తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. నరసింహారెడ్డి పోరాట పటిమ, వీరత్వం ప్రతి తెలుగు వాడికి, ప్రతి భారతీయుడికి స్ఫూర్తి దాయకమన్నారు. నరసింహారెడ్డి పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్య పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుష్ట పాలనపై పోరాటం సాగించాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, బండారు వెంకటేశు, బ్యాంకు శ్రీనివాసులు, బద్రీనాథ్, రాఘవయ్య, రవి, ఐచర్ రమణ, వినయ్, దేవత నాగరాజు, అంజలి పాల్గొన్నారు.

కడప అర్బన్ : రేనాటి వీరుడు, తొలి స్వాతంత్ర్యయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని వివిధ సంఘాల నాయకులు అన్నారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 219వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసి ఉరికంభం ఎక్కిన నరసింహారెడ్డి విగ్రహం కడపలో ఏర్పాటు చేస్తే భావి తరాలకు స్ఫూర్తివంతంగా ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన స్థలం, వనరులు సమకూర్చాలంటూ ప్రభుత్వాన్ని గట్టిగా కోరాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రెడ్డిసేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ త్యాగాన్ని అందరూ గుర్తించుకోవాలన్నారు. నగరంలో స్థలం కేటాయిస్తే తమ సంఘం తరుపున మూడు నెలల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ నరసింహారెడ్డి తిరుగుబాటు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగమేనని పేర్కొన్నారు. ఆయన తిరుగుబాటు జాతీయోద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహాలు కడపలో ఏర్పాటు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి విన్నవించాలని సమావేశంలో తీర్మానించారు. మానవతా సంస్థ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, జానమద్ది సాహితీ పీఠం ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ అధ్యక్షులు కొండూరు జనార్ధన్‌రాజు, రెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు దేవర శ్రీకృష్ణ, గౌరీశంకర్, పర్యాటక ఫోటో గ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ఉయ్యాలవాడ విగ్రహం వద్ద అర్పిస్తున్న నివాళులు

ప్రొద్దుటూరు : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను సోమ వారం రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షులు డాక్టర్ స్వరూప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తక్కువ కాలమే పోరాటం చేసినా ఎంతోమంది స్ఫూర్తిగా తీసుకొని స్వాతంత్ర ఉద్యమంలో పోరాటం చేశారని గుర్తు చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ టిడి వరుణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ శక్తివంతమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పోరాడిన, సమర శంఖం పూరించిన, తెలుగువారి పౌరుషాన్ని రుచి చూపించిన రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. స్పందన రాం ప్రసాద్‌రెడ్డి, టీటీడీ మాజీ బోర్డు మెం బర్ మారుతీ ప్రసాద్, కోట ఓబుల్ రెడ్డి, సూర్య నారా యణ రెడ్డి, రుక్మానందరెడ్డి, ఏరువా లక్ష్మిరెడ్డి, బద్వేలు నాగమణిరెడ్డి, పద్మ వీరన్న, గురు మోహన్ రెడ్డి, బూతురు వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి, మునిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట : చైర్మన్ అమర్నాథ్


కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందని పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్ర మాన్ని సోమవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి ఎ.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రైతులను లాభాల బాట నడిపించే దిశగా వ్యవసాయం, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. పులివెందుల డివిజన్‌లో సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రైతు కుటుంబాన్ని వ్యవసాయ, సచివాల సిబ్బంది కలవాలన్నారు. రైతుల సమస్యలను తెలుసుకొని ఆ మేరకు పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామన్నారు. ఎఒ చెన్నారెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దువ్వూరు : వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు పంచ సూత్రాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నుంచి శనివారం వరకు రైతన్న మీ కోసం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సుబ్బారెడ్డి, ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గుడిపాడులో అధికారులు రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి వెంకట రమణా రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గ్రామ ఉద్యాన నాయకురాలు మాధవిలత పాల్గొన్నారు.

వేంపల్లె : రైతుల సంక్షేమం కోసమే రైతన్న-మీ కోసం అనే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు టిడిపి మండల కన్వీనర్ రామ మునిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ప్రతి రైతు ఇంటికెళ్లి కరపత్రాలను గ్రామ సచివాలయం సిబ్బందితో కలిసి టిడిపి నేతలు పంపిణీ చేశారు. డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, వీరభద్ర, జబిబుల్లా, గంగధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, డక్కా రమేష్, బాబు, విఆర్‌ఓలు, వ్యవసాయ శాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది, టిడిపి నేతలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని తహశీల్దార్ వెంకట సాయినాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురిజాలలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మురళీమోహన్, మండల ప్రకృతి వ్యవసాయ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, వీఆర్వో చంద్రమోహన్, రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ రాజీవ్, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర నీటిపారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎఒ దేవి పద్మలత సీతారాంపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. విఎఎ సాయితేజ, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమలత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుప్రజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మహేష్, టిడిపి నాయకులు సుదర్శన్, నారపురెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

మైదుకూరులో.. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ తెలిపారు. మైదుకూరు మండలం అన్నలూరు గ్రామంలో ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేసేందుకు అయిదు విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం కార్యా చరణ అమలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మైదుకూరు సహాయ వ్యవ సాయ సంచాలకులు ఎం కృష్ణమూర్తి, ఎఒ బాల గంగాధర్‌రెడ్డి, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోపవరం : సభాభవనంలో రైతన్న మీకోసం వారోత్సవాల నిర్వహణపై ఎంపిడిఒ సురేష్‌బాబు అధ్యక్షన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ సిబ్బందిని 12 టీమ్‌లుగా విభజించి 5,476ఇళ్లు డోర్ టు డోర్ సర్వే నిర్వహించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రెటరీ విజయకుమార్, విఆర్‌ఒ జయరాములు, సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రమిస్తున్న వైసిపి నాయకులు

వాటర్ గ్రిడ్ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వాటర్ గ్రిడ్ పథకం పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కోరారు. ఆ మేరకు సోమవారం వారు ఆర్‌డిఒ చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో దాదాపు రూ.480 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని చేపట్టారన్నారు. 2021 జూన్ నెలలో 299 గ్రామాలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కింద వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించారన్నారు. పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఉద్దేశంతో మెఘా ఇంజినీరింగ్ సంస్థకు పనులు అప్పగించారన్నారు. వైసిపి పాలనలో పనులు శరవేగంగా జరిగాయన్నారు. ఈ పథకానికి కావలసిన ముఖ్యమైన భూసేకరణ లింగాల మండలం పార్నపల్లి వద్ద నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అవసరమైన విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ ఉపకేంద్రం పనులు దాదాపు 25 కిలోమీటర్ల విద్యుత్ లైన్ పనులు మొదటి దశలో సత్వరమే పూర్తి చేశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క శాతం పనులు కూడా జరగలేదన్నారు. కేవలం రూ.8 కోట్లు ఖర్చుపెడితే మిగిలిన పెండింగ్ పనులన్నీ పూర్తవుతాయన్నారు. పులివెందుల మున్సిపాలిటీ ప్రతి ఇంటికీ సమృద్ధిగా తాగునీరు అందుతుందన్నారు. నిర్లక్ష్యం వీడి పనులు పూర్తి చేసి పులివెందుల ప్రజలకు అంకితం చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి పులివెందుల పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్ కోడి రమణ, కిషోర్, భార్గవి, కనక వీరారెడ్డి, చంద్రమౌళి, ఖాదర్, బీసీ సెల్ కార్తీక్ సంపత్ మల్లికార్జున, పద్మనాభరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి రోగుల గుర్తింపుపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈనెల 30వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ నల్లబెల్లి హిమబిందు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం నల్లబెల్లి హిమబిందు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కలవారిని ప్రాథమిక దశలో గుర్తించి అంగవైకల్యం రాకుండా చూడాలన్నారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చేతులు, పాదాలు, తిమ్మిర్లు, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవడం వంటి లక్షణాలు గుర్తించి రెఫర్ చేస్తామన్నారు. డీపీఎంఓ శివ శంకరయ్య మాట్లాడుతూ ఎల్సిడిసి ఈనెల 17 నుండి 30వ తేదీ వరకు సర్వే జరుగుతుందన్నారు. సర్వేలో వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి ఉచితంగా ప్రభుత్వం ఎండిటి మందులు ఇస్తుందని తెలిపారు. సర్వే ఆశాలకు తగు సూచనలు చేశారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిహెచ్ఈఓ శోభారాణి, సిఓ ఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శి పద్మావతి, ఆశాలు పుష్పావతి, మల్లీశ్వరి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రమిస్తున్న జగన్‌మోహన్ నాయక్

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని కల్లూరుపల్లె తండా గిరిజనులకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా బంజారా విద్యార్థి సంస్థ జిల్లా అధ్యక్షుడు రమావత్ జగన్ మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన పంచాయతీ ఏర్పాటు మధ్యలోనే ఆగిపోయిన ప్రక్రియ తక్షణమే ఏర్పాటు చేయాలని సోమవారం ఎంపిడిఒ కె.శివారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కల్లూరు గ్రామ పంచాయతీలో గిరిజన జనాభా 1,300 వందలకుపైగా ఉందన్నారు. ఇక్కడి గిరిజనులు దశాబ్దాలుగా చాలా వెనకబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో గిరిజన ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి, కలెక్టర్‌కు విన్నవించారని తెలిపారు. అప్పట్లో కొంత వరకు ఆ ప్రక్రియ జరిగిందన్నారు. ప్రభుత్వం మారడంతో ఆగిపోయిందన్నారు. స్పందించిన ఎంపిడిఒ మాట్లాడుతూ సంబంధిత అధికారి డిపిఓకు నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో మూడె రవీంద్ర నాయక్, బుక్యే బాబు నాయక్, బుక్యే అభిషేక్ నాయక్ పాల్గొన్నారు.

లే అవుట్ల క్రమబద్ధీకరణ : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో ప్లాట్లు వేసిన మూడు లే అవుట్లను జిఓ నెం.134 ప్రకారం క్రమబద్ధీకరణ చేస్తున్నామని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని మున్సిపల్ కమిషనర్ శేష ఫణి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.711, 712 714, 8.95 ఎకరాల్లో 139 ప్లాట్లు వేసిన లేఔట్, సర్వే నెం.631-2, 631-3, 1.91 ఎకరాల్లో 32 ప్లాట్ల లేఔట్, సర్వే నెం. 649-1, 649-2, 2.104 ఎకరాల్లో 35 ప్లాట్లు వేసిన లేఔట్లకు ఆమోదం తెలిపినట్లు కమి షనర్ తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే 15 రోజుల్లోపు తెల పాలని ఆయన సూచిం చారు.

IN THE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S.No.1026/2024

Putta Maheswar Reddy S/o Mysura Reddy, age 62 years, Hindu, residing at D.No. 9/54-8, Bhavani Nagar, Akkayapalli, Kadapa City, Y.S.R Kadapa District. Permanent resident of Ediga Palle, Peddacheppalle, Kamalapuram Mandal, Y.S.R Kadapa District. **...Plaintiff**

Vs

Palagiri Saroja W/o Palagiri Diwakar Reddy, age 55 years, Hindu, R/at F- 5/1, Krishna Nagar, Zuari Cement Factory, Yerraguntla Town and Mandal, Y.S.R Kadapa District. **...Defendant**

SUMMONS

Whereas the plaintiff has instituted a suit against the defendant for specific performance and you are here by summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to give answer to all such questions on the 17th day of December 2025 at 10-30-AM, in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defense. Take notice that, in defaults of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

//By Order of the Court//

N.PRAVEEN KUMAR REDDY
Advocate for the Plaintiff
Cell: 9494073076